ప్రజాశక్తి
బుధవారం 4 అక్టోబరు 2023



రేబిస్ రహిత శ్రీకాకుళం లక్ష్యం

శ్రీకాకుళం : శ్రీకాకుళం నగరాన్ని రేబిస్ రహిత ప్రాంతంగా తీర్చిదిద్దాలన్నదే లక్ష్యమని శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. నగరంలోని ఖాజీపేట ఎబిసి సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన ఎబిసి మానిటరింగ్ కమిటీ నెలవారీ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. వీధి కుక్కల సంఖ్యను నియంత్రించడం అవసరమన్నారు. రేబిస్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు గ్రీన్‌మెర్సీ సంస్థ, నగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యాన చేపట్టిన వీధి కుక్కల జనన నియంత్రణ కార్యక్రమం అమలు తీరుపై కమిటీ సంతృప్తి వ్యక్తం చేసింది. అనంతరం ఆర్గాన్ కౌంట్ నిర్వహించి 122 వీధి కుక్కలకు సెప్టెంబరులో సంతాన నిరోధక శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు కమిటీ నిర్ధారించింది. నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ వెంకటరావు, పశు సంవర్ధకశాఖ ఎడి కృష్ణారావు, అసిస్టెంట్ వెట్ సర్జన్ డాక్టర్ హేమంత్ కుమార్, నగరపాలక సంస్థ ప్రజారోగ్య సిబ్బందిపాల్గొన్నారు.

చి'వరి'కింతే

- వర్షాభావ పరిస్థితులతో అసంపూర్ణంగా పంటల సాగు
- 89 శాతం విస్తీర్ణంలోనే వరి పంట
- అన్నిరకాల పంటల సాగు 87 శాతమే
- ఒక్క ఎకరాలోనూ నువ్వులు వేయలేని పరిస్థితి

ఖరీఫ్ ప్రారంభం నుంచి వెంటాడిన వర్షాభావ పరిస్థితులు చివరి వరకు సాగాయి. సీజన్‌లో కురవాల్సిన స్థాయిలో వర్షం పడలేదు. తొమ్మిది మండలాల్లో కరువుఛాయలు అలుముకున్నాయి. పలాస డివిజన్‌లోని ఆరు మండలాలు తీవ్ర వర్షపాతం లోటు జాబితాలో ఉన్నాయి. వర్షపాతం ఫలితంగా ఈ సంవత్సరం అనుకున్న స్థాయిలో పంటల సాగు కాలేదు. రాగులు, పెసలు, గోగు వంటి పంటల సాగు నాలుగో వంతు కూడా రైతులు వేయలేకపోయారు. నువ్వు పంటను ఒక్క ఎకరాలోనూ విత్తనాలు పడలేదు.



ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్‌లో అన్నిరకాల పంటలు కలిపి 4,37,165 ఎకరాలు సాగు లక్ష్యంగా నిర్ధేశించుకోగా, 3,81,833 ఎకరాల్లో (87 శాతం) పంటలు వేశారు. వరి పంటను 3,98,750 ఎకరాల్లో వేస్తారని అంచనా వేయగా, ఇప్పటివరకు 3,39,588 ఎకరాల్లో (85 శాతం) సాగు అయింది. మొక్కజొన్న పంటను ఈ సంవత్సరం 26,375 ఎకరాల విస్తీర్ణంలో వేయాలని అనుకోగా 23,633 ఎకరాల్లో (90 శాతం) వేశారు. పత్తి పంటను 4,620 ఎకరాల్లో వేయాలనుకోగా 2,763 (60 శాతం) మేర వేశారు. చెరుకు పంటను 4,550 ఎకరాల మేర వేస్తారని అంచనా వేయగా 1470 ఎకరాలు (32 శాతం) మేర వేశారు. కందులు 335 ఎకరాల్లో వేయాలని లక్ష్యంగా నిర్ధేశించుకోగా, ఇప్పటివరకు 93 ఎకరాలు (28శాతం) మేర సాగవుతోంది. వేరుశనగ 1333 ఎకరాల మేర సాగు లక్ష్యం కాగా, ప్రస్తుతం 328 ఎకరాల్లో (25 శాతం) వేశారు. మినుములు 273 ఎకరాల్లో రైతులు విత్తనాలు వేస్తారని అంచనా వేయగా, ఇప్పటివరకు 70 ఎకరాల్లో (26 శాతం) వేశారు. ఈ సంవత్సరం 165 ఎకరాల్లో సజ్జలు వేయాల్సి ఉండగా, 58 ఎకరాలు (35 శాతం) వేశారు. నువ్వు పంటను 98 ఎకరాల్లో వేస్తారని అంచనా వేయగా, ఒక ఎకరాలోనూ వేయలేదు.

పలు రకాల పంటలు 20 శాతం లోపే...

ప్రస్తుత ఖరీఫ్‌లో 253 ఎకరాల్లో పెసలు వేయాలని లక్ష్యంగా నిర్ణయించగా 20 ఎకరాలు (11 శాతం), రాగులు 145 ఎకరాల్లో రైతులు వేస్తారని అంచనా వేయగా 20 ఎకరాల్లో (14 శాతం) వేశారు. గోగు పంటను ఈ సంవత్సరం 258 ఎకరాల్లో వేయాలని లక్ష్యంగా తీసుకోగా 48 ఎకరాల్లో (18 శాతం) వేశారు.

ఖరీఫ్‌లో 1.1 శాతం లోటు వర్షపాతం

ఖరీఫ్‌లో జిల్లా మొత్తం మీద 0.7 శాతం వర్షపాతం లోటు ఉంది. ఈ సీజన్‌లో సాధారణ వర్షపాతం 696.4 మి.మీ నమోదు కావాల్సి ఉండగా 688.7 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో తొమ్మిది మండలాల్లో లోటు వర్షపాతం కొనసాగుతోంది. 14 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా, ఏడు మండలాల్లో అధిక వర్షపాతం కురిసింది. వర్షపాతం లోటు ఉన్న జాబితాలో టెక్కలి, వజ్రపుకొత్తూరు, మందస, ఇచ్ఛాపురం, కంచిలి, కవిటి, సోంపేట, నందిగాం, పోలాకి, జి.సిగడాం మండలాలు ఉన్నాయి.

పలాస డివిజన్‌లో కరువుఛాయలు

జిల్లాలో ఉన్న మూడు డివిజన్లలో ఖరీఫ్ ప్రారంభమైన నాటి నుంచి నేటివరకు వర్షాల పరిస్థితిని పరిశీలిస్తే, పలాస డివిజన్‌లో కరువుఛాయలు అలుముకున్నాయి. జిల్లాలో తొమ్మిది మండలాలు తీవ్ర వర్షపాతం లోటు జాబితాలో ఉండగా, అందులో ఆరు మండలాలు ఈ డివిజన్‌లోనే ఉన్నాయి. పలాస డివిజన్ పరిధిలోని ఎనిమిది మండలాల్లో కలిపి సాధారణంగా 729 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా, 538.5 మి.మీ వర్షం పడింది. డివిజన్‌లో 26.1 శాతం మేర వర్షపాతం లోటు కనిపిస్తోంది. టెక్కలి, శ్రీకాకుళం డివిజన్లలో పరిస్థితులు కొంత ఆశాజనకంగా ఉన్నాయి. టెక్కలి డివిజన్‌లోని తొమ్మిది మండలాల్లో సాధారణ వర్షపాతం 755 మి.మీగా ఉండగా, ఖరీఫ్ సీజన్ ముగిసే నాటికి 854.5 మి.మీ వర్షం కురిసింది. 13.2 శాతం అదనంగా వర్షపాతం నమోదైంది. శ్రీకాకుళం డివిజన్‌లోని 13 మండలాల్లో సాధారణ వర్షపాతం 635.9 మి.మీగా ఉండగా, సెప్టెంబర్ 30 నాటికి 666.2 మి.మీ వర్షం కురిసింది. డివిజన్‌లో 4.8 శాతం అదనంగా వర్షపాతం నమోదైంది.

హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వం

- టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కళా వెంకట్రావు
- ర్యాలీ భగ్నానికి పోలీసుల యత్నం
- పలువురు నాయకుల ముందస్తు అరెస్టు



కూన రవికుమార్‌ను అరెస్టు చేసి తరలిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాజ్యాంగం కల్పించిన హక్కులను రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం కాలరాస్తోందని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు కిమిడి కళా వెంకట్రావు, జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ విమర్శించారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, నాయకులు బండారు సత్యనారాయణ మూర్తి అరెస్టును నిరసిస్తూ శ్రీకాకుళం నగరంలో మంగళవారం నిర్వహించిన తలపెట్టిన ర్యాలీని పోలీసులు భగ్నం చేసేందుకు యత్నించారు. ఇందులో భాగంగా ర్యాలీకి బయలుదేరుతున్న కళా వెంకట్రావును ఎచ్చెర్లలో పోలీసులు అడ్డుకున్నారు. కూన రవికుమార్‌ను ముందస్తు అరెస్టు చేసిన పోలీసులు పలాస పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం అమలవుతోందన్నారు. నిర్బంధాలు, కక్షపూరిత చర్యలకు భయపడేది లేదన్నారు. చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసి జైల్లో పెట్టినా ఇంతవరకు ఒక్క సాక్ష్యం కూడా ప్రభుత్వం చూపించలేకపోయిందని చెప్పారు.

ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి ఆధ్వర్యాన టిడిపి శ్రేణులు నగరంలోని ఏడు రోడ్ల కూడలి నుంచి ర్యాలీగా బయలుదేరారు. పోలీసులు అడ్డుకునేందుకు ప్రయత్నించగా టిడిపి నాయకులు సూర్యమహల్ వద్ద రోడ్డుపై బైఠాయించారు. బైఠాయించిన వారిని అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నించగా ఎమ్మెల్యే అశోక్ వారితో వాగ్వివాదానికి దిగారు. అయినా పోలీసులు వారిని పోలీసు వాహనాల్లో ఎక్కించి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. అయినా పట్టు వీడని టిడిపి నాయకులు 80 అడుగుల రోడ్డు వరకు ర్యాలీని కొనసాగించారు. ర్యాలీలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొండు శిరీష, కలమట సాగర్, ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు, మాదారపు వెంకటేష్, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్ను నాగార్జున ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

'ఫిష్ ఆంధ్ర'తో మత్స్యకారులకు ఉపాధి

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు



ఫిష్ ఆంధ్రా అవుట్‌లెట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి ధర్మాన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మత్స్యకారులకు ఉపాధి చూపేందుకే ఫిష్ ఆంధ్రా స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని పొన్నాడ వంతెన వద్ద ఫిష్ ఆంధ్రా స్టాల్‌ను మంగళవారం ప్రారంభించారు. ఒక్కో అవుట్‌లెట్‌కు రూ.3.50 లక్షల చొప్పున కేటాయించినట్లు తెలిపారు. నగరంలోని పాలిటెక్నిక్ కళాశాల వద్ద 19 అవుట్‌లెట్లను ప్రారంభించామన్నారు. మంచి చేపలను పౌరులకు అందించాలనే సంకల్పంతో ఫిష్ ఆంధ్రాకు రూపకల్పన చేశామన్నారు. చేప పిల్లల రవాణాకు రూ.13.39 లక్షలతో వాహనం కొనుగోలు చేసేందుకు సాయం అందించినట్లు తెలిపారు. సముద్రంలో వేటకు వెళ్లి చనిపోయిన వారి కుటుంబాలకు రూ.పది లక్షలు చొప్పున సాయం అందిస్తున్నట్లు చెప్పారు. మంచినీళ్లపేట వద్ద ఫిష్ లాండింగ్ సెంటర్, బుడగుట్లపాలెం ఫిషింగ్ హార్బర్ పనులు చేపడుతున్నామన్నారు. ఈ పనులు పూర్తయితే జిల్లాలోని మత్స్యకారులు గుజరాత్‌కు వలస వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. మూలపేట పోర్టు నిర్మాణం పనులు శరవేగంగా సాగుతున్నాయని, ఈ పోర్టు పూర్తయితే ప్రపంచంతో జిల్లాకు అనుసంధానం అవుతుందని తెలిపారు. గత ప్రభుత్వం మత్స్యకారులకు తీరని అన్యాయం చేసిందన్నారు. కార్యక్రమంలో తూర్పు కాపు కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మామిడి శ్రీకాంత్, వైసిపి రైతు విభాగం అధ్యక్షులు అంబటి శ్రీనివాసరావు, డిసిఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, జెడ్‌పిటిసి రుప్ప దివ్య, మత్స్యశాఖ జెడి శ్రీనివాసరావు, ఎఫ్‌డిఒ గంగాధర్, పొన్నాడ రిషి, శ్రీనివాస్ పట్నాయక్, గంగు నరేంద్ర, సురాడ సూర్యం, గురుమూర్తి, గనగల్ల రాము తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్ డే విజయవంతం

- పలుచోట్ల రైతు, కార్మిక సంఘాల నిరసనలు
- అజయ్ మిశ్రాను బర్తరఫ్ చేయాలని డిమాండ్



రణస్థలం : మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు



శ్రీకాకుళం అర్బన్ : నిరసన తెలుపుతున్న రైతు, కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, టెక్కలి రూరల్, పలాస, రణస్థలం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ, లఖింపూర్ ఖేరి ఘాతుకాన్ని నిరసిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా, ట్రేడ్ యూనియన్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపుమేరకు మంగళవారం చేపట్టిన బ్లాక్ డే విజయవంతమైంది. శ్రీకాకుళం, టెక్కలి, పలాసలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. రణస్థలంలో సభ నిర్వహించారు. ఇందులో భాగంగా నగరంలోని అంబేద్కర్ కూడలి వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు, కాంగ్రెస్ కిసాన్ మోర్చా జిల్లా నాయకులు సనపల అన్నాజీరావు, రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, కౌలురైతు సంఘం జిల్లా నాయకులు పోలాకి ప్రసాదరావు, భవిరి కృష్ణమూర్తి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గణేష్ మాట్లాడారు. 2021 అక్టోబర్ మూడో తేదీన రైతు వ్యతిరేక మూడు నల్ల చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఉత్తరప్రదేశ్‌లోని లఖింపూర్ ఖేరిలో నిరసన తెలుపుతున్న ఆందోళనకారులను కారుతో తొక్కించి మారణకాండకు సూత్రధారి అయిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అజయ్ మిశ్రాను మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన రైతు కుటుంబాలకు పరిహారం చెల్లించి పునరావాసం కల్పించాలన్నారు. రైతుల పోరాట ఫలితంగా నల్ల చట్టాల అమలుకు వెనక్కి తగ్గిన కేంద్ర ప్రభుత్వం, రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను నేటికీ అమలు చేయలేదని విమర్శించారు. కనీస మద్దతు ధరల గ్యారంటీ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించాలన్నారు. విద్యుత్ చట్ట సవరణ బిల్లు ఉపసంహరించుకోవడంతో పాటు ఉపాధి హామీని పట్టణ ప్రాంతాలకు విస్తరించి 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కె.నాగమణి, ఎ.మహాలక్ష్మి, ఎస్.అప్పన్నమ్మ, ఎ.సత్యం తదితరులు పాల్గొన్నారు.

టెక్కలిలో సిఐటియు కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు బగాది వాసుదేవరావు, సిఐటియు నాయకులు ఎన్.షణ్ముఖరావు, హెచ్.ఈశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బి.ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

పలాసలో కాశీబుగ్గ పాత బస్టాండ్ గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, ఎఐకెఎం నాయకులు ఎం.రామారావు, జీడిరైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్, పలు ప్రజాసంఘాల నాయకులు కె.పురుషోత్తం, టి.సింహాద్రి, సిపిఐ నాయకులు చాపర వెంకటరమణ, చాపర వేణుగోపాల్, పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దిల వినోద్, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు తామాడ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే హక్కుల సాధన

రణస్థలం : ఐక్య పోరాటాలతోనే హక్కులు కాపాడుకోవాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అన్నారు. బ్లాక్ డేలో భాగంగా మండలంలో పైడిభీమవరంలోని సిఐటియు కార్యాలయంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని, కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన రాతపూర్వక హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం నల్ల చట్టాలు రద్దు చేసినా ఇతర రూపాల్లో అమలు చేస్తోందని చెప్పారు. మోడీ ప్రభుత్వం అదానీ, అంబానీ ప్రయోజనాల కోసం పనిచేస్తోందని విమర్శించారు. విశాఖ ఉక్కు రక్షణకు ఈనెల ఐదో తేదీన విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ వద్ద నిర్వహిస్తున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. సభలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి, జిల్లా కోశాధికారి ఎ.సత్యనారాయణ, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రతి బుధవారం 'జగనన్నకు చెబుదాం'

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్



ప్రజాశక్తి - శ్రీకాకుళం

ప్రతి బుధవారం నిర్దేశించిన మండల ప్రధాన కేంద్రాల్లో జగనన్నకు చెబుదాం (జెకెసి) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు అక్టోబర్ నెల షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈనెల 4న కొత్తూరు, 11న సంతబొమ్మాళి, 18న గార, 25న కవిటి మండల ప్రధాన కేంద్రాల్లో జెకెసి నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల స్థాయి జెకెసి గురించి అన్ని గ్రామాల్లో విస్తృతం ప్రచారం కల్పించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా ఫిర్యాదులపై తక్షణ పరిష్కారానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో జిల్లాస్థాయి అధికారులతో పాటు మండల స్థాయి అధికారులు భాగస్వామ్యం కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను రిజిస్ట్రేషన్ చేయడం, నమోదైన అర్జీలను అదే రోజు జెకెసి పోర్టల్‌లో ఆయా రెవెన్యూ డివిజనల్ అధికారులు నమోదు చేసి పర్యవేక్షించడం, ఆడిట్, ఫిర్యాదుదారుని స్పందన, ఫిర్యాదుల పున: పరిశీలన, సంతృప్తిస్థాయి పెంచడం వంటి వాటిపై చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కలెక్టర్, ఎస్‌పి, జాయింట్ కలెక్టర్, ఆర్‌డిఒ, జెడ్‌పి సిఇఒ, వ్యవసాయ, పశు సంవర్ధక, మత్స్య, ఉద్యానశాఖ, డిఆర్‌డిఎ, గృహ నిర్మాణం, డ్వామా, ఐసిడిఎస్ పీడీలు, డిఇఒ, డిపిఒ, డిఎస్‌ఒ, వంశధార, ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇలతో పాటు పలు శాఖల జిల్లా అధికారులతో పాటు మండలస్థాయి అధికారులు పాల్గోనున్నటుల తెలిపారు. ఈ కార్యక్రమానికి అధికారులందరూ రికార్డులతో సిద్ధం కావాలని పేర్కొన్నారు.

డిసెంబరు 4న చలో ఢిల్లీ



మాట్లాడుతున్న చిన్నారావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

దళిత హక్కులు, సామాజిక న్యాయం కోసం డిసెంబర్ 4న చలో ఢిల్లీ కార్యక్రమం చేపడుతున్నట్లు కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సూర్యనారాయణ, ఆర్.చిన్నారావు తెలిపారు. చలో ఢిల్లీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నగరంలోని సిఐటియు కార్యాలయంలో కెవిపిఎస్ రజతోత్సవ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్‌ను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. జస్టిస్ పున్నయ్య కమిటీ సిఫార్సులను అమలు చేయాలన్నారు. అసైన్డ్ చట్ట సవరణను ఉపసంహరించుకోవాలని, ప్రతి దళిత కుటుంబానికి రెండెకరాల భూమి పంపిణీ చేయాలన్నారు. ఉపాధి హామీ ద్వారా వ్యవసాయ కూలీలకు 200 రోజులు పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. రోజు కూలి రూ.600 ఇవ్వాలన్నారు. ప్రభుత్వ రంగాన్ని కాపాడడంతో పాటు ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. దళిత, గిరిజనులకు ఇస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్ 300 యూనిట్లకు పెంచాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార కేసుల్లో 41 సిఆర్‌పిసి నిబంధనలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దళితుల హక్కుల కోసం మరిన్ని పోరాటాలు నిర్మించేందుకు ప్రజలు తోడ్పాటు అందించాలని కోరారు. సమావేశంలో కెవిపిఎస్ నగర ఉపాధ్యక్షులు టి.తిరుపతిరావు, కమిటీ సభ్యులు కె.భాస్కరరావు, ఎస్.ఎర్రయ్య, డి.వాసు, ఎ.ఈశ్వర్, టి.ప్రసాద్, ఆర్.కోటి, ఎం.శ్రీను పాల్గొన్నారు.

విశాఖపట్నం - భువనేశ్వర్ మధ్య

'వందేభారత్' నడపాలి

రైల్వే బోర్డు చైర్‌పర్సన్‌కు ఎంపీ వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వందేభారత్ సెమీ హైస్పీడ్ రైలును భువనేశ్వర్-విశాఖపట్నం మధ్య నడపాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు కోరారు. ఈ రైలుకు శ్రీకాకుళం రోడ్డులో హాల్ట్ సౌకర్యం కల్పించాలన్నారు. దీని వల్ల ఒడిశా-ఉత్తరాంధ్ర మధ్య వాణిజ్య, పర్యాటక, సాంస్కతిక సంబంధాలు మరింత మెరుగు పడతాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ మేరకు రైల్వే బోర్డు చైర్‌పర్సన్ జయవర్మ సిన్హాతో ఢిల్లీలో మంగళవారం భేటీ అయి వినతిపత్రం అందజేశారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన ప్రయాణికులకు రైలు సౌకర్యాలకు సంబంధించి ప్రత్యేక చొరవ చూపాలన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల నుంచి రోజూ వేలాది మంది హైదరాబాద్‌కు రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. భువనేశ్వర్ - సికింద్రాబాద్ విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలులో గతంలో పది స్లీపర్ కోచ్‌లు ఉండేవని, వాటిని కుదించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సాధారణ, మధ్య తరగతి ప్రజలను దృష్టిలో పెట్టుకుని స్లీపర్‌తో పాటు జనరల్ బోగీలనూ పెంచాలని కోరారు. భువనేశ్వర్ - పలాస మధ్య రాకపోకలు సాగిస్తున్న రైలును శ్రీకాకుళం రోడ్డు వరకు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. విశాఖ - పలాస మధ్య నడుస్తున్న రైలును ఇచ్ఛాపురం వరకు పొడిగించాలని కోరారు. హౌరా - యశ్వంతపూర్ రైలుకు ఇచ్ఛాపురంలో, రౌర్కెలా - గుణుపూర్ (రాజ్యరాణి) ఎక్స్‌ప్రెస్‌కు పాతపట్నంలో, భువనేశ్వర్-రామేశ్వరం రైలుకు శ్రీకాకుళం రోడ్డు, పలాసలో, హౌరా - మైసూరు సూపర్‌ఫాస్ట్ రైలుకు శ్రీకాకుళం రోడ్డులో, భువనేశ్వర్-విశాఖపట్నం (ఇంటర్ సిటీ) ఎక్స్‌ప్రెస్‌కు హరిశ్చంద్రపురంలో హాల్ట్ కల్పించాలని కోరారు. విశాఖ-వారణాసి మధ్య రైలు నడిపేందుకు ఆమోదంపై కృతజ్ఞతలు తెలిపారు.

29న కొత్త ఓటర్ల జాబితా విడుదల

సబ్ కలెక్టర్ నూరుల్ కమర్



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

టెక్కలి : ఓటర్ల జాబితా మార్పులు చేర్పులపై తుది జాబితాను ఈనెల 29వ తేదీన విడుదల చేయనున్నట్లు టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ తెలిపారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలోని ఆయన ఛాంబరులో రాజకీయ పార్టీల నాయకులతో ఓటర్ల జాబితాపై మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 17వ తేదీన తుది జాబితా ప్రచురణ చేయాల్సి ఉన్నా, కొన్ని కారణాల రీత్యా 29వ తేదీకి వాయిదా వేశామన్నారు. తుది జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఫారం-6, 7, 8 వినియోగించుకోవాలన్నారు. కోటబొమ్మాళి మండలం జగన్నాథపురానికి చెందిన సుమారు 50 ఓట్లు సంతబొమ్మాళి మండలం జగన్నాథపురంలో కలిసిపోయాయని, వాటిని వెనక్కి తెప్పించి సవరణ చేపట్టాలని జనసేన టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కణితి కిరణ్‌కుమార్ కోరారు. దీనిపై స్పందించిన సబ్ కలెక్టర్ పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. సంతబొమ్మాళి మండలం సీతానగరంలోని పోలింగ్ కేంద్రంలో సౌకర్యాల్లేవని, మెరుగుపరచాలన్నారు. సమావేశంలో తహశీల్దార్ కె.ప్రవల్లికప్రియ, టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరి, పెదరట్టి మణి, వైసిపి మండల అధ్యక్షులు బగాది హరి, ఎ.రాహుల్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

త్వరితగతిన ఓటరు క్లయిమ్‌ల పరిష్కారం

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నూతన ఓటర్ల జాబితా కూర్పులో భాగంగా ఫారం-6, 7, 8 కింద వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అధికారులను ఆదేశించారు. నోటీసులు జారీ చేసే ప్రక్రియ, వెబ్‌సైట్ అందుబాటులోకి రాగానే పూర్తి కావాలని సూచించారు. అప్పటివరకు పూర్తి సన్నద్ధతతో ఉండాలన్నారు. రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, డిఆర్‌ఒ ఎం.గణపతిరావుతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈనెల నాలుగో తేదీ నుంచి ఇవిఎంల వెరిఫికేషన్ చేపట్టి 14వ తేదీ లోగా పూర్తి చేస్తామని కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులతో మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ల సవరణ జాబితా కార్యక్రమంలో రాజకీయ పార్టీలు సమర్పించిన క్లయిమ్‌ల అభ్యంతరాలు, అనోమలిస్, చనిపోయిన, డూప్లికేట్, బదిలీ చేయబడిన, నకిలీ ఓటర్ల జాబితాల వెరిఫికేషన్, ఎపిక్ కార్డు జనరేషన్ తదితర ఆన్‌లైన్‌లో పెండింగ్ ఉన్న అంశాలను వెంటనే డిస్పోజ్ చేయాలని చెప్పారు. నియోజకవర్గ స్థాయిలో ప్రతి వారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి చేపడుతున్న కార్యక్రమాలను వివరించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, ఉప కలెక్టర్లు మురళీకృష్ణ, జయదేవి, సుమబాల, ఆర్‌డిఒ బి.శాంతి తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష'తో మెరుగైన వైద్యం


రోగులకు కిట్లు అందజేస్తున్న మంత్రి ధర్మాన


కవిటి : ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ రామారావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రజారోగ్యానికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నామని రెవెన్యూ శాఖామంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. గార మండలం కళింగపట్నం, మత్స్యలేశం గ్రామాల్లోని జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను ఆయన ప్రారంభించి రోగులతో మాట్లాడారు. జగనన్న ఆరోగ్య సురక్షను ఐదు అంచెలుగా నిర్వహిస్తున్నామని, దీనిని వినియోగించుకోవాలని పిలుపు ఇచ్చారు. విద్య, వైద్యం ప్రథమ ప్రాధాన్యాలుగా తమ ప్రభుత్వం ఎంచుకుని పనిచేస్తున్నదన్నారు. ఈ రెండు రంగాలకూ అధికంగా నిధులు వెచ్చిస్తున్నామన్నారు. తద్వారా ఆయా రంగాల్లో మంచి ఫలితాలు పొందగలిగామని తెలిపారు. పాలనలో వస్తున్న మార్పులను అర్థం చేసుకోవాలని మంత్రి తెలిపారు. తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, డిసిఎంఎస్ గొండు కృష్ణమూర్తి, ఎంపిపి గొండు రఘురాం, మండల వైసిపి అధ్యక్షులు పీస గోపి, నాటక అకాడమి డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి , ఎంపిడిఒ, తహశీల్దార్, వైద్యాధికారి బి. తిరుమలరావు, సర్పంచ్‌లు బి. లలిత, రాజు, మార్పు పృధ్వి, కొయ్యాన నాగభూషణం, కెప్టెన్ ఎరన్న, జగదీష్ పాల్గొన్నారు.

జలుమూరు: పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకే సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని అంధవరంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపిపి వాన గోపి, పంచాయతీరాజ్ జిల్లా అధ్యక్షులు దామ మన్మథరావు, మండల సలహాదారుడు పైడి విఠలరావు, జెసిఎస్ కన్వీనర్ ధర్మాన జగన్మోహనరావు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

కొత్తూరు : మండలంలోని బలదలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రెడ్డి శాంతి ప్రారంభించారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, సర్పంచ్‌లు భారతి, అశోక్‌కుమార్, జి.ఆనందరావు, బి.శ్రీను పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని కోసమాలలో నిర్వహించిన ఆరోగ్య సురక్షలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి పాల్గొని మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి.సరోజని, ఎంపిడిఒ పి.చంద్రకుమారి, ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్ కుమార్, జెడ్‌పిటిసి గూడ ఎండయ్య పిఎసిఎస్ అధ్యక్షులు ఉర్లన బాలరాజు, మండల కన్వీనర్ పల్లి యోగి, వైద్యాధికారులు హేమంతలక్ష్మి, గ్రీష్మ, అలేఖ్య, పావని పాల్గొన్నారు.

కవిటి: మండలంలోని కొత్తపుట్టుగలో ఆరోగ్య సురక్షను ఎమ్మెల్సీ నర్తు రామారావు ప్రారంభించారు. అనంతరం ఐసిడిఎస్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన స్టాల్ పరిశీలించి, పోషణ కిట్లు అందించారు. కార్యక్రమంలో ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, కవిటి ఎంపిపి కడియాల పద్మ, వైసిపి మండల అధ్యక్షుడు కడియాల ప్రకాష్, నర్తు నరేంద్ర, పాండవ శేఖర్, మద్దిలి ఈశ్వరరావు, దువ్వు కృష్ణారెడ్డి, తడక జోగారావు, సనపల జానకిరావు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : మండలంలోని అమలపాడు సచివాలయ ఆవరణలో నిర్వహించిన ఆరోగ్య సురక్షలో జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ పాలిన శ్రావణి పాల్గొని మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయకుమార్, సర్పంచ్ దున్న రత్నం బాలరాజు, వైద్యులు సుధీర్, విజయ్ కుమార్ రెడ్డి, ప్రత్యూష, సునీత, సుజాత, తహశీల్దార్ బి.అప్పలస్వామి, ఉపసర్పంచ్ గిరి పాల్గొన్నారు.

పలాస : మున్సిపాలిటీ పరిధిలోని సూదికొండ ప్రాంతంలో ఆరోగ్య సురక్షను చైర్‌పర్సన్ బల్ల గిరిబాబు ప్రారంభించారు. అనంతరం రోగులకు వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్, కమిషనర్ నాగేంద్ర కుమార్, డిఇ నవీన్ పాల్గొన్నారు.

అలాగే బొడ్డపాడులో నిర్వహించిన ఆరోగ్య సురక్షలో 330 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తామడ మధన్, రెంటికోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ టి.సునీల్‌కుమార్, డాక్టర్ పిబిఆర్ఎల్ దేవి, నెఫ్రాలజిస్టు కె.విద్యాసాగర్, గైనకాలజిస్టు డాక్టర్ యు.స్వరాజ్యలక్ష్మి, జనరల్ ఫిజిషియన్ డాక్టర్ గంగారం, ఎంపిడిఒ రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండలంలోని తేలుకుంచిలో ఆరోగ్య సురక్ష శిబిరంలో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పిరియా సాయిరాజ్ పాల్గొని మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి బోర పుష్ప, పిఎసిఎస్ అధ్యక్షులు నర్తు నరేంద్ర యాదవ్, మండల పార్టీ అధ్యక్షులు పాతిర్ల రాజశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపిపి దువ్వు వివేకానంద, మండల జెసిఎస్ అధ్యక్షులు ఆశి పురుషోత్తంరెడ్డి, టౌన్ జెసిఎస్ అధ్యక్షులు సాలిన ఢిల్లీరావు, కారంగి మోహనరావు, ఉప్పడ రాజారెడ్డి, తిప్పన నాగరాజు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ పరిధి బెల్లుపడ కాలనీ-2 సచివాలయం వద్ద నిర్వహించిన ఆరోగ్య సురక్షలో మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

టెక్కలి రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని టెక్కలి నియోజకవర్గం సమన్వయకర్త, జెడ్‌పిటిసి దువ్వాడ వాణి అన్నారు. మండలంలోని రావివలసలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సందర్శించారు. అనంతరం రోగులకు మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి అట్లా సరోజనమ్మ, వైస్ ఎంపిపి మున్నెల కిషోర్, సర్పంచ్ సర్లాన బాలకృష్ణ, అలయ కమిటీ చైర్మన్ సర్లాన సుధాకర్, ఎంపిడిఒ చింతాడ లక్ష్మీబాయి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోలాకి : మండలంలోని అంపలాం సచివాలయం పరిధిలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య ప్రారంభించారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ బైరాగినాయుడు, వైసిపి మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, సర్పంచ్ ప్రతినిధి వై.ధర్మారావు, పోలాకి, గుప్పిడిపేట పిహెచ్‌సి వైద్యులు శ్రీనాథ్, రత్నంరాజు, విస్తీర్ణ అధికారి రవికుమార్ పాల్గొన్నారు.

నందిగాం: మండలంలోని దేవుపురంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి వై.చక్రవర్తి, ఎంపిడిఒ జి.శివప్రసాద్, తహశీల్దార్ వై.వి.పద్మావతి, వైద్యాధికారి పి.అంజలి, ఇఒపిఆర్‌డి రాజారావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని వాండ్రాడ సచివాలయ ఆవరణలో నిర్వహించిన ఆరోగ్య సురక్షలో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు పాల్గొని మందులను పంపిణీ చేశారు. తిలారు ప్రాథమిక వైద్య కేంద్రం వైద్యాధికారులు డి.నీరజ, మనీష, ప్రీతి, జోత్న, సురేష్, నితీష్‌కుమార్‌లు 291 మందికి పలు రకాల పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్, డిటి ఆర్.మధు, ఇఒపిఆర్‌డి బొడ్డేపల్లి రామారావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, పేడాడ వెంకటరావు పాల్గొన్నారు.

బూర్జ: మండలంలోని పాలవలసలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపిపి కర్నేన దీప ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రాజశేఖర్, పావని, రమ్యశ్రీ, రోజా, జడ్‌పిటిసి బి.రామారావు, టిట్కో డైరెక్టర్ కె. గోవిందరావు, డిసిసిబి మెంబర్ జల్లు బలరాం నాయుడు, సర్పంచ్‌లు జల్లు అంబుజాక్షి, వీయ్యపు విజయలక్ష్మి, జల్లు అప్పలస్వామినాయుడు, ఎంపిడిఒ రవీంద్రబాబు, తహశీల్దార్ రమణారావు పాల్గొన్నారు.

రణస్థలం: మండలంలోని కృష్ణాపురం సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపిపి ప్రతినిది పిన్నింటి సాయికుమార్ ప్రారంభించారు. ఈ సందకర్భంగా జడ్‌పిటిసి టొంపల సీతారాం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఆర్.వి రమణమూర్తి, ఐసిడిఎస్ సిడిపిఒ ఝాన్సీరాణి, డిప్యూటీ తహశీల్దార్ బి.సత్యవతి, వైస్ ఎంపిపి రాయపురెడ్డి భుజంగరావు(బుజ్జి), పంచాయతీ అధికారి ప్రభాకరరావు, రావాడ పిహెచ్‌సి వైద్యాధికారి సుమన్, ఎఒ ధనుంజయరావు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం : మందులను పంపిణీ చేస్తున్న సాయిరాజ్


టెక్కలి రూరల్ : మందులను పంపిణీ చేస్తున్న వాణి


పలాస : రక్త పరీక్షలు చేయించుకుంటున్న గిరిబాబు

సోదాలు అప్రజాస్వామికం

ప్రజాశక్తి- శ్రీకాకుళం లీగల్

న్యాయవాదుల ఇళ్లపై ఎన్ఐఎ దాడులను ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దుంపల రమణారావు, ఎం.అప్పారావు, జిల్లా బార్ అసోసియేషన్ ఐలూ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పి.లక్ష్మీపతి, డి.ఈశ్వరరావు ఒక ప్రకటనలో ఖండించారు. న్యాయవాది, ఎల్ఐసి నాయకులు కిల్లారి ఈశ్వరరావు, కె.వి.జగన్నాథం గృహాలపై దాడులు అప్రజాస్వామికమని పేర్కొన్నారు. న్యాయవాదులను ఒత్తిడికి గురిచేయడం సరికాదన్నారు. ఈ దాడిని న్యాయవాద వృత్తిపై దాడిగా భావిస్తున్నామని అన్నారు.

పలాస : తెలుగు ఉభయ రాష్ట్రాల్లోని ప్రజా సంఘాల ఇళ్లల్లో ఎన్ఐఎ బృందాలు సోమవారం చేసిన సోదాలను తీవ్రంగా ఖండిస్తున్నామని పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రతినిధులు, ఉపాధ్యక్షులు పిండి వెంకటరావు కార్యదర్శి ఫకీర్ నాయుడు, సహాయకులు సోమనాథం, రామారావు, రామానాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. పౌర హక్కుల రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిలారి ఈశ్వరరావు, కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్క కృష్ణయ్య, కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా బాధ్యులు ప్రభాకర్, దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం రాష్ట్ర నాయకులు సాలిన వీరస్వామి, అమరుల బంధుమిత్రుల సంఘం రాష్ట్ర బాధ్యులు జోగి కోదండ, మద్ది ధనలక్ష్మి ఇళ్లపై ఐదు గంటల పాటు సోదాలు చేయడం దారుణమని అన్నారు. ప్రజా సంఘాల్లో పనిచేస్తున్న కార్యకర్తలకు ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధమైన హక్కులను కాల రాస్తున్నారని అన్నారు. ఎవరెవరితో సంబంధాలు ఉన్నాయని తప్పుడు అభియోగాలు మోపి అక్రమ సోదాలు చేయడం అప్రజాస్వామిక చర్య అని అన్నారు.

బ్యాడ్మింటన్‌లో జాహ్నవికి గోల్డ్ మెడల్

ప్రజాశక్తి- రణస్థలం రూరల్


గోల్డ్ మెడల్ అందుకుంటున్న జాహ్నవి

ఇంటర్ స్టేట్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ కర్నూలు జిల్లా మహానందిలో అంతర్ జిల్లా 8వ సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ మూడు రోజులు జరిగింది. ఈ టోర్నమెంట్‌లో శ్రీకాకుళం జట్టు గెలుపొందగా ఎన్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఇంటర్మీడియెట్ చదువుతున్న మహంతి జాహ్నవి కీలక ప్లేయర్‌గా నిలిచి బోర్డ్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచి గోల్డ్ మెడల్ సాధించింది. ఈ సందర్భంగా స్కూల్ చైర్మన్ నడుకుదిటి ఈశ్వరరావు(ఎన్ఇఆర్) జాహ్నవి క్రీడా స్ఫూర్తికి అభినందనలు తెలియజేస్తూ ఎన్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌కి ఇది మరో ఘనతగా పేర్కొన్నారు. క్రీడలకు, క్రీడాకారులకు ఇస్తున్న ప్రోత్సాహంపై వివరిస్తూ ఈ మధ్య కాలంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్, ఫుట్‌బాల్ టోర్నమెంట్, చెస్ టోర్నమెంట్‌ను ఉదాహరణగా పేర్కొన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను దేశానికి అందించడానికి స్పోర్ట్స్ హబ్‌ను ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- జలుమూరు


పిహెచ్‌సిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. నాడు-నేడు నిధులు రూ.50 లక్షలతో చేపట్టిన జలుమూరు పిహెచ్‌సి, నాబార్డ్ నిధులు రూ.45 లక్షలతో చేపట్టిన ఇంటింటికీ తాగునీటి కుళాయిని మంగళవారం ప్రారంభించారు. అనంతరం వైసిపి సిఇసి రాష్ట్ర సభ్యులు ధర్మాన పద్మప్రియతో కలిసి జలుమూరులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వీధుల్లోని రోడ్లు, ఇంటింటికీ కులాయి పథకాన్ని విస్తరించాలని గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో ఎంపిపి వాన గోపి, వైసిపి మండల అధ్యక్షులు కనుసు సీతారాం, అల్లాడ పిఎసిఎస్ అధ్యక్షులు మొజ్జాడ శ్యామలరావు, వైస్ ఎంపిపి తంగి మురళీకృష్ణ, పంచాయతీరాజ్ జిల్లా అధ్యక్షులు దామ మన్మథరావు, మండల సలహాదారుడు పైడి విఠల్‌రావు, జెసిఎస్ కన్వీనర్ ధర్మాన జగన్మోహనరావు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు


బహుమతులను అందజేస్తున్న జీవన్‌కుమార్

ప్రజాశక్తి- సోంపేట

కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కేంద్ర ఎక్సైజ్ కస్టమ్స్ అధికారి, నారాయణపురానికి చెందిన మల్లెన జీవన్‌కుమార్ అన్నారు. మండలంలోని మామిడిపల్లిలో స్థానిక మహాత్మ యువజన సంఘం ఆధ్వర్యాన ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి ఓపెన్ క్విజ్ పోటీల విజేతలకు మంగళవారం బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించడం వల్లనే జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించగలరన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ కష్టపడి చదివి ఉన్నత స్థానానికి ఎదిగిన జీవన్ కుమార్ యువతకు స్ఫూర్తిగా నిలుస్తారని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.శేషగిరి, ఎంపిటిసి డి.మాధవరావు, యువజన సంఘ సభ్యులు బి.సింహాచలం, ఆర్.అనంతరావు, పి.నాని, కె.షణ్ముఖరావు, ఎల్.మేఘనాథం, జి.జయరాం, పి.కృష్ణారావు, జి.దొరబాబు, ఢిల్లీరావు పాల్గొన్నారు.

'సత్యసాయి విద్యా విహార్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- పలాస


సాయి కార్తీక్


లిఖిత

ఈస్ట్‌కోస్ట్ రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్, ఖుర్దా రోడ్ అనే అంశంపై గత నెల 17న వ్యాసరచన పోటీలను నిర్వహించారు. పలాస, ఖుర్దా, కటక్, బధ్రక్, అంగుల్ సెంట్రల్‌ల్లో డివిజన్ స్థాయిలో పోటీలను రెండు అంశాలపై నిర్వహించారు. గాంధీ జయంతి సందర్భంగా వాటి ఫలితాలను విడుదల చేశారు. ఈ ఫలితాల్లో రామకృష్ణాపురం సత్యసాయి విద్యా విహార్‌లో చదువుతున్న రఘుపాత్రుని సాయి కార్తీక్, రఘుపాత్రుని సాయి లిఖిత తమ ప్రతిభను చాటుకుంటున్నారు. పదో తరగతి చదువుతున్న రఘుపాత్రుని సాయి కార్తీక్, చంద్రయాన్-3 అను అంశంపైన, ఆరో తరగతి చదువుతున్న రఘుపాత్రుని సాయి లిఖిత, ఔట్ డోర్ గేమ్స్ అనే అంశంపై ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. విద్యార్థులకు ట్రస్టు చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతిచౌదరి, ఉపాధ్యాయులు అభినందించారు.

'ఆఫ్‌షోర్' హామీ ఏమైంది?

జనసేన నాయకులు దుర్గారావు



మాట్లాడుతున్న దుర్గారావు

పలాస మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేసిన ఆఫ్‌షోర్ రిజర్వాయరు ఏళ్ల గడుస్తున్నా పనులు ముందుకు సాగడం లేదని, పాదయాత్రలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఆఫ్‌షోర్ పూర్తి చేసి రైతులకు ఇస్తామని చెప్పిన హామీ ఏమైమందని జనసేన నియోజకవర్గం నాయకులు డాక్టర్ వి.దుర్గారావు ప్రశ్నించారు. మండలంలోని రేగులపాడు ఆఫ్‌షోర్ ఎడమ కాలువ రైతులతో జనసేన పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆఫ్‌షోర్ ఎప్పుడూ పూర్తి అవుతుందా? సాగునీరు పంట భూములకు ఎప్పుడూ అందుతుందా? అని రైతులు ఎదురుచూస్తున్నారని అన్నారు. 12 ఏళ్ల క్రితం రైతుల నుంచి పంట భూములు తీసుకుని ఇప్పటి వరకు చాలా మందికి పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్అండ్ఆర్ కాలనీలో మౌలిక సదుపాయాలు లేక నిర్వాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించాలని, నష్టపరిహారం అందని లబ్ధిదారులకు అందించాలని డిమాడ్ చేశారు. తక్షణమే ఆఫ్‌షోర్ రిజర్వాయరు పనులు ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు హరిష్‌కుమార్, శ్రీకాంత్, పుక్కల ఉమాశంకర్, దిలీప్ పాణిగ్రాహి మందస మండల అధక్షులు కుప్పాయి గోపాల్, వంశీచౌదరి, లావేటి సురేష్ ధర్మారావు, కిరణ్, బమ్మిడి మహేష్, దినేష్ పాల్గొన్నారు.

వంశధార నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- హిరమండలం

వంశధార నిర్వాసితులకు పెండింగ్‌లో ఉన్న అదనపు ప్యాకేజీ ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌కు అడుగుదాం రండని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగరాపు ఈశ్వరమ్మ పిలుపునిచ్చారు. మండలం గులుమూరు పంచాయతీలో ఉన్న శాస్తుర్లపేట తోటలో ఉన్న వంశధార నిర్వాసితులతో కలిసి ఆమె మాట్లాడారు, వంశధార నిర్వాసితులకు వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నాయకుని హోదాలో ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కారన్నారు. 2013 భూ సేకరణ చట్టం చేస్తానన్న జగన్ అధికారం వచ్చిన తర్వాత దాని ప్రస్తావనే చేయకపోవడం బాధాకరమన్నారు. ఇచ్చిన హామీ అమలు చేయమని నిర్వాసితు అడుగుతుంటే అదనపు ప్యాకేజీ అని చెప్పి రూ.216.77 కోట్లు కేటాయించి సగం మందికే బ్యాంకు అకౌంట్లో చెల్లించి మిగిలిన నిర్వాసితులకు నేటికి ఏడాదిన్నర గడిచిన పెండింగ్ ప్యాకేజీలు ప్రస్తావని లేకపోవడం నిర్వాసితులకు మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. బుధవారం కొత్తూరు ఎండిఒ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హాజరవుతున్న సందర్భంగా వంశధార నిర్వాసితులందరూ వచ్చి అదనపు ప్యాకేజీ ఇస్తారా ఇవ్వరా అని కలెక్టర్‌ను కలిసికట్టుగా అడుగుదామన్నారు. నిర్వాసితులందరూ రాజకీయాలక తీతంగా ఐక్యంగా పెండింగ్ ప్యాకేజీలు సాధన కోసం ఉద్యమించాలని కోరారు. కార్యక్రమంలో వంశధార నిర్వాసిత మహిళలు పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న నిర్వాసితులు

బహిరంగ సభను జయప్రదం చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

రణస్థలం: విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఈనెల 5న విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ వద్ద జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు సిహెచ్ అమ్మన్నాయుడు కోరారు. పైడిభీమవరంలో విశాఖ ఉక్కు రక్షణ బహిరంగ సభ వాల్ పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు నినాదం అశేష త్యాగాలతో సాధించుకున్న మణిహారం విశాఖ స్టీల్ ప్లాంట్ అని, లక్షమందికి ఉపాధి కల్పిస్తోందన్నారు. మరో 25వేల ఉద్యోగాలకు అవకాశం వుందని తెలిపారు. విశాఖ, ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తోంది. రూ. 3లక్షల కోట్ల ఆస్థి కలిగి వుందని, ప్లాంట్ ఏర్పాటుకు కేంద్రం రూ. 4, 980 కోట్లు పెట్టుబడిపెడితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.54వేల కోట్ల ఆదాయం సమకూర్చిందన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు అమ్మకానికి పెట్టిందని, ఈ ప్రజా ద్రోహ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉక్కు సంకల్పంతో స్టీల్ ప్లాంటు కార్మికులు, కార్మిక, ప్రజా సంఘాలు 950 రోజులకుపైగా పోరాడుతున్నారన్నారు. కార్యక్రమంలో కె.గురునాయుడు, తారకేశ్వరరావు, రాంబాబు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీడీ

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఎచ్చెర్ల: మండలం కొత్తపేట జెడ్‌పిహెచ్ స్కూల్ విద్యార్థులు ఇటీవల జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోటీల్లో త్రోబాల్ అండర్-14 విభాగంలో ఎం.షర్మిల, అండర్-17 విభాగంలో బి.ప్రశాంతి ప్రతిభ కనపర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. హెచ్‌ఎం లక్ష్మణరావు, పిడి ఎం.స్వాతి, ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

మున్సీపేట రోడ్డుకు మోక్షం

పొందూరు: మండలంలోని కావలి ఆర్అండ్‌బి రహదారి నుంచి వయా మున్సీపేట, లచ్చయ్య పేట మీదుగా తాడివలస వరకూ స్పీకర్ తమ్మినేని సీతారాం చొరవతో ఎఐఐబి నిధులతో బిటి రహదారి నిర్మాణం చేపడుతున్నారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎంతో కాలంగా సరైన రహదారి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డామని, ఎట్టకేలకు రహదారి నిర్మాణం జరగడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జరుగుతున్న రహదారి నిర్మాణ పనులను డిఇ చంద్రశేఖర్, ఎఇ సత్యనారాయణ, గోకర్ణపల్లి సర్పంచ్ ప్రతినిధి చింతాడ సత్యప్రసాద్ పరిశీలించారు.


నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న వెంకటేష్

ఆమదాలవలస : మండలంలోని మహిళా స్వయం శక్తి సంఘాల సభ్యులందరికీ ఆర్థిక అక్షరాస్యత (ఫైనాన్సియల్ లిటరసీ)పై అవగాహన కల్పిస్తున్నట్లు వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. రిజర్వు బ్యాంకు ఆదేశానుసారం, యూనియన్ బ్యాంకు సౌజన్యంతో బుధవారం రామచంద్రాపురం గ్రామంలో సిఎఫ్ఎల్ సిబ్బంది చిగురుపల్లి వెంకటేష్ స్వయం సహాయక సంఘాల మహిళలకు బ్యాంకు లావాదేవీలు, ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. గ్రామాలలో రైతులు, మహిళలు బ్యాంకు లావాదేవీలు జరుపునప్పుడు ఎటిఎం కార్డులను ఉపయోగిస్తున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బ్యాంకు సేవల్లో వచ్చే సమస్యలపై బ్యాంకు ఇంటిగ్రేడ్ అంబుడ్స్‌మన్ టోల్ ఫ్రీ నంబర్ 14448 కు ఫోన్ చేసి సమస్యలను తెలియపర్చవచ్చని వివరించారు. అదే విధంగా సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ టోల్ ఫ్రీ నెంబర్ 1930కు కాల్ చేసి సమస్యను తెలియపర్చాలని సూచించారు. బ్యాంకుల్లో అమలవుతున్న ఇన్సూరెన్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో వెలుగు సిసి రామప్పడు, సిసి ఉమాలక్ష్మి, సిఎఫ్ గాయత్రి, సిఎఫ్ఎల్ సిబ్బంది రామారావు పాల్గొన్నారు.

గతుకుల రోడ్డు.. ముళ్లపొదలు

కవిటి: మండలంలోని డి.జి.పుట్టుగ పంచాయతీ నుంచి నెలవంకకు అనుసంధానం చేసే రహదారి పూర్తిగా గతుకులమయమై ప్రయాణికుల సహనాన్ని పరీక్షిస్తోంది. జంగిల్ క్లియరెన్స్ పనులు చేయకపోవడంతో రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలు పేరుకుపోయి మలుపులు ప్రమాదకరంగా మారుతున్నాయి. ఈ రహదారిలో ప్రయాణమంటేనే స్థానికులు హడలిపోతున్నారు. ఇటీవల కాలంలో ఈ రహదారిలో పలువురు ప్రమాదానికి గురై గాయాలపాలయ్యారు. ప్రత్యామ్నాయం లేకపోవడంతో ఆ గతుకుల రోడ్డే వీరికి దిక్కవుతోంది. మరోవైపు ముల్లపొదలు పెరిగిపోవడంతో మలుపుల వద్ద, గోతులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రహదారిపై స్థానిక ఎంపిటిసి పూర్ణచంద్రరావు ప్రతీ మండల సమావేశంలో ప్రస్తావిస్తున్నా ఫలితం లేకపోతోంది. ఇదే పంచాయతీలోని వడ్డిజల్లుపుట్టుగలోని ప్రధాన రహదారి చినుకుపడితే చాలు చిత్తడిగా మారి దమ్ముమడిని తలపిస్తోందని స్థానికులు వాపోతున్నారు. కొన్నేళ్లుగా ఇదే పరిస్థితిలో ఉన్నా తమకు రహదారి సౌకర్యం కల్పించిన నాథుడే కరువయ్యాడని గ్రామస్తులు నిట్టూరుస్తున్నారు. ఆ సమయంలో కనీసం నడవడానికీ పనికిరాకుండాపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రోడ్లు, భవనాలశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని, ప్రగడపుట్టుగ నుంచి డిజి పుట్టుగ పంచాయతీ వరకు రోడ్డుకు ఆనుకుని కూలేందుకు సిద్ధంగా భారీ వృక్షాలు ఉన్నాయని, వీటిపై ఆర్అండ్‌బి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తమకు రహదారి సౌకర్యం కల్పించి, పూర్తిస్థాయిలో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


నెలవంక రోడ్డులో పేరుకుపోయిన పిచ్చి మొక్కలు


చిత్తడిగా మారిన వడ్డిజల్లుపుట్టుగ రోడ్డు

పిడుగుపాటుకు గృహోపకరణాలు ధ్వంసం

ప్రజాశక్తి- బూర్జ


ధ్వంసమైన బల్బు

మండలంలోని గంగంపేటలో మంగళ వారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతో పాటు పిడుగులు పడ్డాయి. గ్రామానికి చెందిన పేన పెంటయ్య ఇంటియ్యపై పిడుగు పడటంతో ఇంట్లోని టివి, ఇన్వేటర్, ఫ్యాన్లతో పాటు ఇతర ఎలక్ట్రికల్ వస్తువులు ధ్వంసమయ్యాయి. అలాగే గ్రామంలో 15 ఇళ్లల్లో విద్యుత్ పరిసరాలు ధ్వంసమైనట్టు గ్రామస్తులు తెలిపారు. తహశీల్దార్ సనపల రమణారావు ఫోన్ ద్వారా సమాచారం తెలుసుకుని విఆర్‌ను గ్రామానికి పంపించారు. పిడుగు పాటు కారణంగా ఎటువంటి ప్రాణనష్టం జరగపోవడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

కిడ్నీ వ్యాధితో యువకుడు మృతి


రాహుల్ (ఫైల్)

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం మున్సిపాలిటీ 3వ వార్డు అమీనాసాహెబ్‌పేటకు చెందిన బొబ్బిలి రాహుల్ (టిట్టు) (34) కిడ్నీ వ్యాధితో సోమవారం రాత్రి మృతి చెందారు. కొన్ని నెలలుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ కవిటి, శ్రీకాకుళంలోని డయాలసిస్ కేంద్రంలో డయాలసిస్ చేసుకునేవాడు. పరిస్థితి విషయమిం చడంతో ఇచ్ఛాపురంలో ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందాడు. పరిస్థితి విషమించి మృతి చెందారు. గతంలో తండ్రి, ఇటీవల తల్లి కూడా మృతి చెందింది.


పోస్టర్లను అందజేస్తున్న తేజేశ్వరరావు

తేజేశ్వరరావు పర్యటన

మెళియాపుట్టి: పాతపట్నం నియోజకవరాన్ని అభివృద్ధి చేసే వారికే పట్టం కట్టాలని నాయకులు, విద్యావేత్త సిరిపురం తేజేశ్వరరావు అన్నారు. మండలంలో పాలెం, ఆంజనేయపురం, పొగడవెల్లి, పడ్డ, సవరముకుందుపురం, ముకుందపురం, వెంకటాపురం, బందపల్లి, బంజీరు, దీనబంధుపురం తదితర గ్రామాల్లో మంగళ వారం పర్యటించారు. కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి పోస్టర్లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలన్నదే తన తపనని అన్నారు. పదవులు, హోదా కోసం తాను రాజకీయా ల్లోకి రాలేదని, తాను పుట్టిన ఈ ప్రాంతానికి తన వంతుగా ఏదైనా చేయాలని లక్ష్యంతోనే ఈ మార్గాన్ని ఎంచుకున్నానని అన్నారు. స్వార్థ రాజకీయాల వల్ల రాష్ట్రంలో పాతపట్నం వెనుకబడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యధికంగా వలసలు పోతున్నారని, వీరి కోసం ఆలోచించే వారినే పట్టం కట్టాలని సూచించారు.యువతకు ఉపాధి కల్పించే నాయకులకు అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సరాలి సర్పంచ్ పడాల షణ్ముఖరావు సభ్యులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుల సైకిల్‌యాత్ర

కోటబొమ్మాళి : మాజీ సిఎం చంద్రబాబు రిమాండ్‌కు నిరసనగా అన్ని ప్రాంతాల్లో సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నామని రణస్థలం మండలం టిడిపి నాయకులు ఎన్.రామకృష్ణ తెలిపారు. సోమవారం రణస్థలంలో సైకిల్‌పై బయలుదేరి జాతీయ రహదారిలో సిబిఎన్ ఆర్మీ ప్రచార యాత్ర పేరుతో మంగళవారం కోటబొమ్మాళి టిడిపి కార్యాలయానికి చేరుకుంది. ముందుగా టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్ సైకిల్‌యాత్రకు స్వాగతం పలికారు. అనంతరం దీక్షా శిబిరానికి సంఘీవావం తెలిపారు. రాష్ట్రం మొత్తం సైకిల్‌యాత్ర నిర్వహించి ప్రచారం చేస్తామని తెలిపా రు. గణేష్, సుందరరావు, రామ్మూర్తి పాల్గొన్నారు.

21వ రోజుకు రిలే నిరాహార దీక్షలు



పోలాకి : బగ్గు రమణమూర్తిని హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

పలాస: కాశీబుగ్గలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఆధ్వర్యాన చేపట్టిన రిలే నిరాహారదీక్షలు మంగళవారంతో 21 వ రోజుకు చేరుకుంది. ముందుగా నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు యార్లగడ్డ వెంకన్న చౌదరి, తమ్మినేని ధనంజేయ, ఆరియాపల్లి ప్రభుదాసు, శేషు, వంక రామారావు, సార జోగారావు, మురిపింటి నారాయణ, కోనేరి అదినారాయణ, బి.విజయ్, సూరినారాయణ పండ మోహనబాబు, మామిడి అప్పారావు, పుచ్చ హేమంత్, కోత సాయి, డిల్లీ, బన్నీ, శాంతమూర్తి, పృథ్వి, మహేష్, ధనలక్ష్మి, కల్పన పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: స్థానిక టిడిపి కార్యాలయం వద్ద చేపట్టిన టిడిపి నిరసన దీక్షలో నాయీబ్రహ్మణ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు కుప్పిలి వెంకటరావు, నౌగాపు నాగరాజులు ఎస్.కొండలరావు, జమ్ము రవికుమార్, గొరెంట్ల శ్రీను పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంగళ వాహిద్యాలు మోగించి చంద్రబాబుకు మద్దతిగా నిరసన తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బోయిన గోవిందరాజులు, కింజరాపు హరివరప్రసాద్, వెలమల విజయలక్ష్మి, తర్ర రామకృష్ణ, బగాది శేషు పాల్గొన్నారు.

పోలాకి: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రిమాండ్ నేపథ్యంలో నిరసనకు వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని మంగళవారం ముదస్తుగా హౌస్ అరెస్టు చేశారు. చంద్రబాబుపై సుప్రీంకోర్టు తీర్పు వాయిదా పడిన సందర్భాలు గందరగోళం ఏర్పడుతుందని ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యాన మబగాంలో ఆయన స్వగృహంలో ఉంచారు.

శ్రీకాకుళం అర్బన్: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు పట్ల శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో పొట్టి శ్రీరాములు జంక్షన్ దగ్గర జిల్లా కేంద్ర పార్టీ కార్యాలయంలో బాబుతో నేను సంఘీభావ దీక్షలో పాల్గొన్న పాతపట్నం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మామిడి గోవిందరావును పోలీసులు అరెస్ట్ చేసి పెద్దపాడు రూరల్ పోలీస్ స్టేషన్లో నిర్బందించారు. ఆయనతో పాటు పాతపట్నం నియోజకవర్గం ఐదు మండలాల తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ఎంజిఆర్ శ్రేణులు ఉన్నారు.



ఎంజిఆర్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

రైతులపై కేసులు ఎత్తివేయాలి

ప్రజాశక్తి- పర్లాకిమిడి

రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేసి బేషరతుగా విడుదల చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోచార్చ పిలుపు మేరకు ప్రజా సంఘాల నాయకులతో కలిసి మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ అమలు చేయాలని, రైతుల, కౌలు రైతుల రుణాలను మాఫీ చేయాలని అన్నారు. ప్రజా వ్యతిరేక విద్యుత్ బిల్లు-2002ను వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో అఖిల భారత కిసాన్ మజ్దూర్ సభ జాతీయ కార్యదర్శి బాలచంద్ర షడంగి, సిపిఎం జిల్లా కార్యదర్శి దొండపాణి రైతో, అఖిల భారత కిసాన్ సభ జిల్లా కార్యదర్శి ముచ్చి బంగారయ్య, గజపతి జిల్లా రైతు కూలీ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రొక్కం లోకనాథం, అఖిల భారత రైతు కూలీ సంఘం శ్రీను బెహరా, పొట్నూరు తిరుపతిరావు, గోకుల్ దళ్ బెహరా, త్రినాథ్ సబర్, సంబ్రా సబర్ పాల్గొన్నారు.

హెచ్ఐవిపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ఎయిడ్స్, హెచ్ఐవి వ్యాప్తి కాకుండా ఉండేందుకు మరింత అవగాహన అవసరమని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ సూచించారు. సెప్టెంబరు 30న రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన యూత్ ఫెస్ట్ 5 కె రెడ్ రన్ మారథాన్ -2023 లో జిల్లాలోని ఇచ్ఛాపురానికి చెందిన సాయి కిరణ్ సాహు, 2వ స్థానంలో నిలిచి బహుమతిని దక్కించుకున్నాడు. అతనికి ఎపి ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ నుంచి రూ. 25 వేలు నగదు బహుమతి దక్కింది. అలాగే నగరానికి చెందిన సంతోష్ కన్సోలేషన్ బహుమతితో పాటు రూ. 2వేల నగదు బహుమతి గెలు పొందారు. వారికి జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ చేతులు మీదుగా మంగళవారం కలెక్టరేట్‌లో బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా సాధికార సంస్థ సిఇఒ ప్రసాదరావు, వైద్య ఆరోగ్యశాఖ మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, కోచ్ శ్రీధర్, డిపిఎం కె .ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



బహుమతులను అందజేస్తున్న కలెక్టర్

జిపిడిపి తయారుకు గ్రామసభ



సమావేశంలో మాట్లాడుతున్న ఎపిఎం కూర్మారావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలో అన్ని గ్రామ పంచాయతీల్లో షెడ్యూల్ ప్రకారం సర్పంచ్ అధ్యక్షతన జరుగుతున్న గ్రామసభల్లో ఎక్కువమంది మహిళలు, ఉపాధి హామీ కూలీలు, చిన్న, సన్న కారు రైతులు భాగస్వామ్యంతో గ్రామపంచాయతీ అభివద్ధి ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. మంగళవారం మండలంలోని చిట్టివలస గ్రామపంచాయతీలో సర్పంచ్ ప్రతినిధి గుజ్జల లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో ఎపిఎం కూర్మారావు పాల్గొని మాట్లాడారు. గ్రామ పంచాయతీలో పారిశుధ్యం, త్రాగునీరు, వీధిదీపాలు, మురుగు నీటి యాజమాన్యం, మంచినీటి చెరువులు, పాఠశాల, అంగన్వాడి కేంద్రం, ఆరోగ్య కేంద్రం, దేవాలయం తదితర ప్రజా ఉపయోగ కేంద్రాలకు సౌకర్యాల కల్పనతో పాటు మానవ వనరుల అభివృద్ధి కోసం సామాజిక కార్యక్రమాలపై అవగాహన, ప్రభుత్వ పథకాలు, వాటికి సంబంధించిన అర్హతలు వివరించారు . సర్పంచ్ ప్రతినిధి లక్ష్మణరావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో అందరి సహకారంతో కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాంబాబు, రైతు సంఘాల కో-ఆర్డినేటర్ రామప్పడు, ఫీల్డ్ అసిస్టెంట్ రామారావు, విఒఎ గురుమూర్తి, గ్రామ సంఘం ప్రతినిధులు, ఉపాధి హామీ కూలీలు, రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

‘ఉపాధి’ పనుల గుర్తింపుపై శిక్షణ

ప్రజాశక్తి- పొందూరు

జాతీయ ఉపాధి హామీ పథకానికి సంబంధించి 2024-25 ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లో వేతనదారులకు వంద రోజులు పనులు కల్పనపై ప్రణాళికలను రూపొందించాలని ఎచ్చెర్ల క్లస్టర్ ఎపిడి కె.లోకేశ్వరరావు, ఎంపిడిఒ సీపాన హరిహరరావు, ఉపాధిహామీ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం పొందూరు, ఆమదాలవలస, ఎచ్చెర్ల మండలాల ఉపాధిహామీ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం చేపడుతున్న చెరువులు, కాలువలతో పాటు, చట్టం ద్వారా అవకాశం కల్పించిన అన్ని పనులకు ప్రణాళికా ప్రక్రియ ద్వారా అన్ని గ్రామాల్లో గుర్తించి పరిపాలనా ఆమోదానికి పంపించేందుకు సిద్ధం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి పి.సింహాచలం, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

సరుకుల పంపిణీ

ప్రజాశక్తి- పలాస

మండలంలోని పెదంచలలో నందిగాం వెంకటరావు ఇటీవల కిడ్నీ వ్యాధితో మృతి చెందాడు. దీంతో మృతుడి కుటుంబ సభ్యులు రోడ్డున పడ్డారు. విషయం తెలుసుకున్న పలాస సామాజిక కార్యకర్త మన్యాల శ్రీనివాసరావు ఆ కుటుంబాన్ని పరామర్శించి మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ సమయంలోనైనా ఎటువంటి అవసరం వచ్చినా తమ దృష్టికి తీసుకొస్తే తక్షణమే సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. కార్యక్రమంలో జనసేన యువకులు తదితరులు పాల్గొన్నారు



సరుకులను పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు

పూర్తిస్థాయి వేతనాలు ఇవ్వాలి

కోటబొమ్మాళి: ప్రజలకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డికి మధ్య సారథులు గ్రామ వాలంటీర్లని నాయకులు, అధికారులకు పదేపదే చెబుతున్నారు. కానీ, కోటబొమ్మాళి మేజరు పంచాయతీలో మాత్రం వాలంటీర్లు జీతాల్లో పంచాయతీ కార్యదర్శి కోతలు పెట్టారని 18 మంది గ్రామ వాలంటీర్లు మంగళవారం ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. వాలంటీర్లకు ప్రభుత్వం నెలకు రూ.5 వేలు గౌరవవేతనం ఇస్తున్నారని, ప్రస్తుత కార్యదర్శి ఒకరికి రూ.1700, మరొకరికి రూ.2 వేలు ఇలా ఒకొక్కరికి ఒకోలాగా గౌరవ వేతనం ఇస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతకుముందు మేజర్ పంచాయతీ సచివాలయాలు ముందు కార్యదర్శి తీరుపై నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వాలంటీర్లు చిగురువలస వెంకటేష్, గంధాపు ప్రసాద్, జలుమూరు మాధవయ్య, కోన మల్లమ్మ, ఎం.కిషోర్, దేవాది గణేష్, కల్లి నాగరాజు, తవిటిరాజు పాల్గొన్నారు.



ఎంపిడిఒకు ఫిర్యాదు చేస్తున్న వాలంటీర్లు

నేటి నుంచి ధర్మప్రచార వారోత్సవం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర దేవాదాయశాఖ ఆదేశాలను అనుసరించి అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ధర్మ ప్రచార వారోత్సవాలను బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ వేడుకల్లో హాజరు కావాలని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావును సంబంధిత నిర్వాహకులు కోరారు. మంగళవారం ఆయన క్యాంపు కార్యాలయంలో ఆహ్వాన ప్రతికను ఇఒ వి.హరిసూర్యప్రకాష్ అందజేశారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు మండవిల్లి రవి, లుకలాపు గోవిందరావు, దుక్క గన్ని రాజు, జలగడుగుల శ్రీనివాస్, మైలపల్లి లక్ష్మి, ద్వారపు అనురాధ, జోగి మల్లేమ్మ, నెమలపురి కోటేశ్వరరావు, లోకేశ్వరి పాల్గొన్నారు.

పుస్తక వాహనం పరిశీలన

టెక్కలి : తరగతి పుస్తకాలతో ఇతర పుస్తకాలనూ చదవి వాటిపై అవగాహన పెంచుకోవాలని ఎస్ఐ ఎల్.రామకృష్ణ అన్నారు. స్థానిక అంబేద్కర్ కూడలి ఆవరణలో విశాలాంధ్ర సంచార పుస్తక వాహనాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొబైల్ ద్వారా పుస్తకం అందుబాటులో ఉన్నా... చేతిలో ఉన్న పుస్తకానికి గుర్తింపు ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు యడ్ల గోపీ, అనపాన షణ్ముఖరావు, వాహన నిర్వాహకులు నజీర్ పాల్గొన్నారు

150 మందికి వైద్య పరీక్షలు

ఇచ్ఛాపురం : పట్టణంలోని గోదావరిపేట 22వ వార్డు కౌన్సిలర్ కాళ్ల దిలీప్ కుమార్ ఆధ్వర్యాన విశాఖ మెడీకవర్ ఆస్పత్రి ఆధ్వర్యాన మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ మేరకు 150 మందికి వైద్యాధికారులు ప్రభు, వినయ్‌లు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాళ్ల ఎర్రమ్మ, బెహరా శేఖర్. త్రినాథ్ బాష పాల్గొన్నారు.

విద్యార్థినులకు దుస్తుల పంపిణీ

టెక్కలి : మండలంలోని భీంపురం గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న 150 మంది పేద విద్యార్థినులకు టెక్కలి సరస్వతీ బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు రామముని రమేష్‌కుమార్, రమేష్ మిశ్రలు మంగళవారం దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సాయిరాజ్ పరామర్శ

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధి 18వ వార్డులో బైక్ ప్రమాదంలో సిహెచ్.దిలీప్ మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ మంగళవారం పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట జెడ్‌పిటిసి ఉప్పడ నారాయణమ్మ, కారంగి మోహనరావు, పురుషోత్తం, సాలిన ఢిల్లీరావు, ఉప్పడ రాజారెడ్డి, దక్కత నూకయ్య, తిప్పన నాగరాజు, చిడిపోతు జగన్నాయకులు, ఉన్నారు..



దిలీప్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న సాయిరాజ్